
అక్రమాల ఇటుకలు పేర్చారు!

- నిబంధనలు పాటించని తయారీదారులు
- అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ఇటుక బట్టీల నిర్వహణ
- వాల్టా చట్టానికి తూట్లు.. ప్రభుత్వ ఆదాయానికి గండి
- చోద్యం చూస్తున్న వివిధ శాఖల అధికారులు

సాగు భూముల్లో అక్రమార్కులు యథేచ్ఛగా ఇటుక బట్టీలు ఏర్పాటు చేసుకుని రూ.లక్షలు సంపాదిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించి బిహార్, ఒడిశా రాష్ట్రాల నుంచి ఒప్పంద కూలీలను తీసుకొచ్చిఏర్పాటు చేసుకుని ఇటుకల తయారీకి పాల్పడుతున్నారు. కాలుష్య నియంత్రణ మండలి ధ్రువ పత్రాలు, స్థానిక సంస్థల నుంచి ట్రేడ్ లైసెన్సులు, జాతీయ రహదారికి దూరంగా ఉండాలన్న నిబంధనలేవీ యలమంచిలి నియోజకవర్గంలో పాటించడం లేదు. కళ్లలో మట్టి, దుమ్ము, ధూళి పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

– యలమంచిలి రూరల్


నారాయణపురం దగ్గర ఇటుక బట్టీ


కొత్తపాలెం వద్ద ఇటుక బట్టీ


యలమంచిలి సమీపంలో ఇటుక బట్టీ నుంచి వస్తున్న పొగలు

యలమంచిలి నియోజకవర్గంలో 60కి పైగా ఇటుక బట్టీలు ఉన్నాయి. ఇటుక బట్టీ ఏర్పాటుకు తయారీదారులు పరిశ్రమలు, గనులు, రెవెన్యూ, కార్మిక, విద్యుత్తు, అటవీ, రవాణా, కాలుష్య నియంత్రణ శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. కూలీలకు భద్రత, బీమా, నివాసానికి ఇళ్ల సౌకర్యం, బాల కార్మికులను దూరంగా పెట్టడం వంటి నిబంధనలు పాటించాలి. కార్మిక చట్టం ప్రకారం ప్రతి బట్టీ యజమాని మునిపాలిటీ, పంచాయతీ నుంచి ట్రేడ్ లైసెన్సు తప్పనిసరిగా తీసుకోవాలి. పరిశ్రమలో ఎన్ని ఇటుకలు తయారు చేస్తారో దానికి సంబంధించిన వివరాలు పొందుపర్చాలి. ఎంత విస్తీర్ణంలో తయారు చేస్తున్నారు, కార్మికుల భద్రత వంటివి చూపించాలి. అన్ని సవ్యంగా ఉన్నాయంటూ రెవెన్యూ అధికారులు ఇచ్చిన ధ్రువపత్రం ఉంటేనే విద్యుత్తు శాఖ అధికారులు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇటుకల తయారీదారులు ఈ నిబంధనలన్నీ సక్రమంగా పాటించకుండా బట్టీలను నిర్వహిస్తున్నా సంబంధిత శాఖల అధికారులు చూసీచూడనట్టుగా వదిలేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

అక్రమంగా మట్టి కొనుగోళ్లు.. పర్యావరణానికి తూట్లు

ఇటుకల తయారీకి అతి ముఖ్యమైన ముడిసరుకు మట్టి. బట్టీల నిర్వాహకులు మట్టిని అక్రమంగా కొందరు వ్యాపారుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. పంట పొలాలు, చెరువుల నుంచి మట్టిని ట్రాక్టర్లతో తెచ్చుకుంటున్నారు. ఈ మట్టిని సమీపంలో ఉన్న రాజకీయ పార్టీల నాయకుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఇటుక బట్టీల నిర్వాహకులకు వారి మద్దతు ఉంటోంది. మట్టితో తయారు చేసిన ఇటుకలను కాల్చడానికి పెద్ద ఎత్తున కలప అవసరమౌతుంది. ఇందు కోసం సమీపంలో పచ్చని చెట్లను యథేచ్ఛగా నరికివేస్తున్నారు. వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి మట్టి, చెట్లను కొనుగోలు చేస్తున్నారు. అంతేకాకుండా ఇటుకలను తయారీ చేసే సమయంలో దుమ్ము, ధూళి ఎగిరి చుట్టు పక్కల గాలి నాణ్యతను తగ్గిస్తున్నాయి. ఇటుకలను కాల్చేటప్పుడు వస్తున్న దట్టమైన పొగ సమీపంలో రహదారులపై ప్రయాణించే వాహనదారులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. యలమంచిలి మున్సిపాలిటీ, మండలంలో ఏటికొప్పాక, పీఎస్ఆర్‌పేట, లక్కవరం, పురుషోత్తపురం, కొత్తపాలెం, నారాయణపురం సహా మరికొన్ని గ్రామాల్లో ఇటుకల తయారీ పరిశ్రమలు ఉన్నాయి. సుమారుగా 15 బట్టీలు నిర్వహిస్తున్నా.. అనుమతులు ఉన్న బట్టీలు కొన్నే ఉన్నాయి. ముఖ్యంగా బట్టీలను జాతీయ రహదారులు, ఇతర రద్దీగా ఉండే రహదారులకు సమీపంలో ఏర్పాటు చేయకూడదనే నిబంధనను పట్టించుకోవడంలేదు. యలమంచిలి సమీపంలో ప్రధాన రహదారుల పక్కనే ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారు. ఇటుకలను రవాణా చేసేటప్పుడు నిబంధనలు పాటించడం లేదు. అయినప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇటుక బట్టీల నిర్వహణపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పొగతో ఇబ్బందులు



యలమంచిలి–అచ్యుతాపురం రహదారి పక్కనే బట్టీలు నిర్వహిస్తున్నారు. ఇటుకలు కాల్చేటప్పుడు దట్టమైన పొగ రహదారిపైకి వ్యాపిస్తోంది. దీంతో ద్విచక్ర వాహన చోదకులు, ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల్లో ప్రయాణించే మహిళలు, వృద్ధులు పొగ కారణంగా ఉక్కిరిబిక్కిరవుతున్నారు. బట్టీలతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– యల్లపు శ్రీనివాసరావు, సోమలింగపాలెం

జనావాసాలకు దూరంగా బట్టీలు ఉండాలి



ఇటుక బట్టీల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి. రహదారులు, జనావాసాలకు కనీసం ఒక కిలోమీటరు దూరంలో బట్టీలు ఏర్పాటు చేయాలి. స్థానిక సంస్థలతో పాటు కాలుష్య నియంత్రణ అధికారుల అనుమతి తప్పనిసరి. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తయారీదారులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఫిర్యాదులొస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– కె.వరహాలు, తహసీల్దార్, యలమంచిలి

క్లుప్తంగా

గంగాలమ్మ తల్లి గుడికి విరాళం


గంగాలమ్మ తల్లి గుడికి విరాళం అందిస్తున్న దాతలు

మునగపాక: పాటిపల్లి–మంగళవరపుపేట గ్రామాల పరిధిలో నిర్మిస్తున్న గంగాలమ్మ తల్లి గుడికి పలువురు భక్తులు తమవంతు విరాళాలు అందజేస్తున్నారు. బుధవారం గాజువాక వుడా కాలనీకి చెందిన డి.సత్యనారాయణ, నాగమణి, తదితరులు రూ.10వేల నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీల చించివేతపై ఫిర్యాదు


ఉమ్మలాడలో చింపివేసిన వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు

మునగపాక: మండలంలోని ఉమ్మలాడలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చింపివేయడంపై ఆ పార్టీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉమ్మలాడలోని పోతురాజుబాబు పండగ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేతల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలను పెద్ద ఎత్తున స్థానిక నాయకులు ఏర్పాటు చేశారు. అయితే కొంతమంది జీర్ణించుకోలేక రాత్రి సమయంలో ఫ్లెక్సీలను చించేశారు. ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నేతలు కోరారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్

తుమ్మపాల: ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు జూలై నెల రేషన్ వారి నివాసాల వద్ద పంపిణీ చేయనున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కె.వి.ఎల్.ఎన్.మూర్తి తెలిపారు. జిల్లాలో ప్రతి చౌకధరల దుకాణాన్ని ఆయా గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందితో అనుసంధానించి ముందుగానే తగిన ఏర్పాట్లు చేశామన్నారు. రేషన్ డీలర్లు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లాలో అన్ని డిపోలకు జూలై నెల కోటా రేషన్ నిల్వలు పంపిణీ పూర్తయిందన్నారు. పై కేటగిరీలోకి వచ్చే రైస్ కార్డుదారులు తమ ఇళ్లలోనే ఉండి, రేషన్ వస్తువులు పొందవచ్చని, చౌకధరల దుకాణాలకు వచ్చే అవసరం లేదన్నారు.

సంపద తయారీ కేంద్రాలతో అదనపు ఆదాయం


వెంకటాపురంలో పర్యటిస్తున్న డీపీవో సందీప్

మునగపాక: సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని డీపీవో ఇ.సందీప్ తెలిపారు. మండలంలోని వెంకటాపురం సంపద తయారీ కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్తపై అవగాహన పెంచుకోవాలన్నారు. సంపద తయారీ కేంద్రాల్లో తయారైన వర్మీని ఎరువుగా వినియోగించుకోవాలని సూచించారు. సీజన్‌లో ప్రతి ఒక్కరూ అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సర్పంచ్ సుందరపు తాతాజీ, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అవగాహనతోనే క్షయ అంతం


క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వాణి జగదీశ్వరీ

అనకాపల్లి టౌన్: అవగాహనతో క్షయ వ్యాధిని అంతం చేయవచ్చని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారి వాణి జగదీశ్వరీ తెలిపారు. మండలంలోని గోపాలపురంలో క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులు తరచూ ఆరోగ్య కేంద్రానికి వచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకుని అవసరమైన మందులు వాడాలన్నారు. దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం లాంటివి క్షయ వ్యాధి లక్షణాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు ఘన సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

నక్కపల్లి: ఇటీవల పెదబోదిగళం ఉన్నత పాఠశాల నుంచి బదిలీ అయిన ముగ్గురు ఉపాధ్యాయులకు స్థానిక హైస్కూల్ ఉపాధ్యాయులు వీడ్కోలు పలికారు. సైన్స్ ఉపాధ్యాయునిగా సుదీర్ఘ కాలంగా పని చేస్తున్న బోడిశెట్టి సత్యనారాయణ, గణిత ఉపాధ్యాయుడు కె.చిన్నారావు, హిందీ ఉపాధ్యాయురాలు ఎ.శ్రీదేవిలను స్థానిక గ్రామ పెద్దలు, సహచర ఉపాధ్యాయులు బుధవారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

డెయిరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న వేతన కార్యదర్శి కృష్ణ

మునగపాక: పాడి రైతులు విశాఖ డెయిరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అరబుపాలెం పాల సంఘ వేతన కార్యదర్శి బొడ్డేడ కృష్ణ కోరారు. బుధవారం సంఘ నూతన డైరెక్టర్లుగా పెంటకోట అచ్చియ్యమ్మ, ఆడారి ముసిలి అప్పారావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కృష్ణ మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా డెయిరీ సేవలందిస్తుందన్నారు. సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, పాల సంఘ అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్, ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జి, శరగడం యోగి నాగేశ్వరరావు, కొయిలాడ ఎర్రయ్యనాయుడు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఎస్.రాయవరం: పెదగుమ్ములూరు సబ్‌స్టేషన్ పరిధిలో చినగుమ్ములూరు ఫీడర్‌లోని పలు గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. చినగుమ్ములూరు, పెట్టుగోళ్లపల్లి, రామయ్యపట్నం, నీలాద్రిపురం, సీతారామపురం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ గ్రామాల మీదుగా ఉన్న విద్యుత్ లైన్లలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతులు చేపట్టే క్రమంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అచ్యుతాపురం రూరల్ : మండలంలో 15 గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెదురువాడ, గొర్లి ధర్మవరం, లంక ధర్మవరం, మెట్ట ధర్మవరం, మార్టూరు రోడ్, దిబ్బపాలెం, భోగాపురం రోడ్, అచ్యుతాపురం, మోసయ్యపేట బర్మాకాలనీ, మోసయ్యపేట, చోడపల్లి, రామన్నపాలెం, కొత్తూరు మోసయ్యపేట, వెంకటాపురం కూడలి, అచ్యుతాపురం ఇందిరమ్మ కాలనీలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ ఉండదన్నారు.

చూచుకొండ సబ్‌స్టేషన్ పరిధిలో..

మునగపాక: మండలంలోని చూచుకొండ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్‌లో భాగంగా చూచుకొండ, గణపర్తి, నరేంద్రపురం, పల్లపు ఆనందపురం, కుమారపురం తదితర గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం

యలమంచిలి రూరల్: యలమంచిలి నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. స్థానిక క్లబ్ రోడ్డు మాదిగపేట సామాజిక భవనంలో జరిగిన ఈ ఎన్నికల్లో యలమంచిలి నియోజకవర్గ అధ్యక్షుడిగా దిగుమర్తి రాజబాబు, పట్టణ అధ్యక్షునిగా పెదపూడి బండియ్య ఎన్నికయ్యారు. అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి వెంకట్రావు మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని నిర్వాహకులు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని అనకాపల్లి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఎలకా బాబు, కార్యదర్శి కాకినాడ కనకేశ్వరావు తదితరులు అభినందించారు.

అల్పపీడన ప్రభావంతో వర్షాలు


కోటవురట్లలో కురుస్తున్న వర్షం


మునగపాక మెయిన్‌రోడ్డులో నిలిచిన వర్షపునీరు


మండల సముదాయానికి వెళ్లే దారిలో నిలిచిన వర్షపునీరు

కోటవురట్ల: మండలంలో అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. రెండు రోజులుగా చిన్నపాటి వర్షం కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనులకు సిద్ధపడుతున్నారు. పలు ప్రాంతాలలో ఖరీఫ్ సాగుకు నారుపోస్తున్నారు. జల్లూరు, బి.కె.పల్లి, యండపల్లి, కోటవురట్ల, రాజుపేట, కైలాసపట్నం, రామచంద్రపురం తదితర ప్రాంతాలలో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. వర్షాలతో గ్రామీణ రహదారులు చిత్తడిగా మారిపోయాయి. గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

వర్షంతో అవస్థలు

మునగపాక: మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి నుంచి అడపాదడపా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించిపోయింది. ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు వర్షం కారణంగా ఇబ్బందులు పడ్డారు. మునగపాక మెయిన్‌రోడ్డు, మండల సముదాయానికి వెళ్లే మార్గంలో వర్షపు నీరు నిలిచిపోయింది. ఈ వర్షం పంటల సాగుకు ఎంతగానో దోహదపడుతుందని మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి తెలిపారు.


ఎస్.రాయవరం మండలంలో కురుస్తున్న వర్షం

ఎడతెరిపి లేకుండా వర్షం

ఎస్.రాయవరం: మండలంలో బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. జనాలు రాకపోవడంతో గ్రామ సచివాలయాలు, మండల కేంద్రంలోని పలు కార్యాలయాలు బోసిపోయాయి. వ్యవసాయ కూలీలు పనులు లేక ఇళ్ల వద్దనే ఉండిపోయారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ


అరబుపాలెంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి

మునగపాక: పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి కోరారు. మండలంలోని అరబుపాలెంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువులు, విత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. భూసార పరీక్షలకు అనుగుణంగా పంటల సాగు చేపట్టడం మంచిదన్నారు. వరిలో విత్తన శుద్ధి చేపట్టాలని, తద్వారా తెగుళ్లను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, పాల సంఘ అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్, మాజీ ఎంపీటీసీ శరగడం శ్రీనివాసరావు, శరగడం యోగి నాగేశ్వరరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: మండలంలోని మాసాహెబుపేట, పెంటకోట గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర సందర్శన, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. మండల వ్యవసాయ అధికారి ఆదినారాయణ మాట్లాడుతూ విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. ఎన్‌పీఎస్ఎస్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పిస్తూ పీఎండీఎస్ కిట్లు, పచ్చిరొట్ట ఎరువుల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్ఏ అజయ్, ఎంపీఈవో సతీష్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి తప్పనిసరి

ఎస్.రాయవరం: ఖరీఫ్ నాట్లుకు సిద్ధమయ్యే రైతులందరూ విధిగా విత్తన శుద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సౌజన్య సూచించారు. గుడివాడ పంచాయతీలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ విత్తన శుద్ధి విధానంలో కిలో వరి విత్తనానికి 8 గ్రాముల సూడో మోనాస్‌తో విత్తుటకు ముందుగా 8 నుంచి 12 గంటలకు ముందుగా పూర్తిగా కలియబెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దూళి శ్రీనుబాబు, మాజీ సర్పంచ్ నల్లపరాజు వెంకటరాజు, ఉద్యానవన సహాయకులు శ్రీధర్, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


గుడివాడలో విత్తన శుద్ధి విధానం వివరిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

పంట మార్పిడితో ప్రయోజనం


రామారాయుడుపాలెంలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

యలమంచిలి రూరల్: పంట మార్పిడితో రైతులకు బహుళ ప్రయోజనాలున్నాయని మండల వ్యవసాయాధికారి పొలిమేర మోహనరావు సూచించారు. పంటల మధ్య వైవిధ్యం ఉండడం వల్ల తెగుళ్ల బెడద తగ్గుతుందన్నారు. చిరుధాన్యాల సాగును ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయన్నారు. మండలంలోని రామారాయుడుపాలెం, పురుషోత్తపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రామారాయుడుపాలెంలో రైతు తోట గణేశ్ 11 ఎకరాల్లో సాగు చేస్తున్న గంటి పంటను ఆయన పరిశీలించారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వలన అనేక దీర్ఘకాలిక వ్యాధులు దరిచేరవన్నారు. పలువురు రైతులకు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయబోయే పంటల సాగుకు సంబంధించి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి, మణి, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరపాలి


మాట్లాడుతున్న వెంకటరావు

మాడుగుల రూరల్ : వచ్చే నెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని గ్రామాల్లోను ఘనంగా నిర్వహించాలని జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ వి.వెంకటరావు తెలిపారు. కె.జె.పురం కాలనీలో బుధవారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బి.నాయుడు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటరావు జెండా ఆవిష్కరణ కార్యక్రమంతో పాటు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పండగ వాతావరణంలో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించాలని కోరారు. మాదిగ ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి ఎ.రవికుమార్, సంపూర్ణ, ఎలకా మాలిబాబు, ఎం.ఎం.దాసు, కండిపల్లి వెంకటరావు, మోర్తా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్సీ విద్యార్థినులకు వసతి గృహం ఏర్పాటు చేయాలి

అనకాపల్లి: ఇంటర్మీడియెట్ నుంచి పీజీవరకు చదువుతున్న ఎస్సీ విద్యార్థినులకు జిల్లా కేంద్రం అనకాపల్లిలో వసతి గృహం ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్రకుమార్ కోరారు. బీసీ వసతి గృహంలో వసతి పొందుతున్న ఎస్సీ విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఈమేరకు స్థానిక జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రామానందంకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శిథిలావస్థకు చేరిన వసతి గృహాల భవనాల శ్లాబ్‌లను పడగొట్టి తాత్కాలికంగా రేకుల షెడ్ వేసి ముస్తాబు చేస్తున్నారని, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కేవలం అనకాపల్లి జిల్లాలో మాత్రమే ఈ విధంగా రేకుల షెడ్డులో విద్యార్థులను ఉంచుతున్నారని చెప్పారు. జిల్లా కేంద్రంలో వసతి లేక గ్రామీణ ప్రాంత విద్యార్థినులు ఇంటిదారి పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి జగదీష్ పాల్గొన్నారు.

బీమా చెక్కుల అందజేత

కశింకోట: మండలంలోని కొత్తపల్లి, బుచ్చెయ్యపేట గ్రామాల్లో మృతి చెందిన ముగ్గురి కుటుంబాలకు పీఎంజేజేబీవై బీమా చెక్కులను బుధవారం పంపిణీ చేశారు.ఆర్థిక అక్షరాస్యతపై కొత్తపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఒక్కొక్కరికీ రూ.2 లక్షల చొప్పున రూ.6 లక్షలు అందించారు. ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ కవిత మాట్లాడుతూ బ్యాంకులో అమలు చేస్తున్న బీమా పథకాలు, ఇతర పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో అక్షరాస్యత కేంద్రం ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు, ప్రాజెక్టు మేనేజర్ వి. అశోక్‌కుమార్, కౌన్సిలర్లు ఆర్.వాణి, ఎ.గిరీష్, సీహెచ్. మహేష్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలి


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శచీదేవి

మునగపాక: ప్రతి మహిళ తన జీవనోపాధిని మెరుగుపరుచుకొని అదనంగా నెలకు రూ.10వేల మేర సంపాదన ఉండేలా చూసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి కోరారు. మునగపాక వెలుగు కార్యాలయంలో బుధవారం మండల మహిళా సమైక్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు మరింత బలోపేతం కావాలన్నారు. మహిళలు ఆర్థిక సాధికారత సాధించడం అవసరమని చెప్పారు. ఆవుల పెంపకంపై దృష్టి సారించి ఆదాయం పెంచుకునే మార్గాలను ఎంచుకోవాలన్నారు. మైక్రో సంస్థల నుంచి రుణాలు తీసుకొని మోసపోరాదన్నారు. పురుషులతో సమానంగా మహిళలు బాగా చదువుకొని ఉన్నత రంగాల్లో రాణించాలన్నారు. ఏపీఎం బాలరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎల్‌సీ శ్రీనివాస్,సీసీలు వేణు,రామకృష్ణ,శ్రీను, నిర్మల, నాగమణి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాయకరావుపేట డివిజన్:
9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com